ఆర్. చక్రారావు

శ్రీ వాకాటి పాండురంగరావు

"ఒరేయ్ అబ్బాయ్!.... ఈ ఆదర్శాలనేవి చదువుకోవడానికీ, రాసుకోవడానికీ మా బాగా ఉంటాయి.... ఏం, ఉంటాయి కదా అని ఆచరించబోతే చాలా చేదుగా ఉంటాయి. పట్టుకుంటే గట్టిగా పాషాణంలా ఉంటాయి. గనకా, పిచ్చి పిచ్చి నమ్మకాలు పెట్టుకుని జీవితాన్ని పాడుచేసుకోకు. నామాట విను. పెద్దవాళ్లు పెట్టిన కొన్ని సంప్రదాయాలలో ఎంతో ఉపయోగకరమయిన అర్థం ఉంటుందని తర్వాత తెలిసి వస్తుంది. అంచేత శుభ్రంగా కట్నం తెచ్చే పిల్లనే పెళ్లాడు. కాదని యీ టీచరు కూతురిని చేసుకున్నావా .... ఆనక నన్నేమీ అడగకు. నీ ఖర్మ ! ...." అని అన్నారు నాన్న తొమ్మిదేళ్ల కింద ఒక రోజున—

ఆ నాడు నాన్నను, కాదన్నాడు చక్రారావు.

ఇరవై మూడో యేట, ఇంకా పెళ్లికాకముందు, ఇంటి పెద్ద ఇంకొకరుగా ఉన్నప్పుడు—ఎవరికయినా జీవితం అంటే ఓ పొడుగాటి తారు రోడ్డులా ఉంటుంది. ఆదర్శాల కారె క్కితే చాలు అతిసునాయాసంగా ఈల వేసుకుంటూ ఆ తారురోడ్డు దాటేయ వచ్చనిపిస్తుంది. అంతేకాదు. పెద్ద వాళ్లు వేసే రూపాయల కూడికలూ, ఆశయాల తీసివేతలూ చూస్తుంటే ఆశ్చర్యమూ, అసహ్యమూ కలుగుతాయి. చక్రారావుకూ అంతే అయింది.

నాన్నను కాదన్నాడు. సీతను తనదానిని చేసుకున్నాడు. పెళ్లికి కూడా రానన్నారు నాన్న. ఆయన హృదయాన్ని అంతగా నొప్పించాడు ! రెండేళ్లపాటు పట్టుదలలు పరిపాలించాయి. నాన్న ఉత్తర మయినా రాయలేదు. అమ్మ వస్తానంటే అడ్డుపడ్డారట. అని తమ్ముడు రాశేవాడు. వాడా పాటికి ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతుండేవాడు. అప్పుడప్పుడు ఇంటి విషయాలతో ఉత్తరాలు రాస్తుండేవాడు.

సీత తల్లి అయింది. నాన్న పట్టుదల సడలింది. అయినా హృదయం అంటే గాజు కూజా కాదుగా విరిగిం తర్వాత అతకడానికి—తను అలా ఎదిరించిన తరువాత నాన్నకు కాస్త కూస్త సంతృప్తీ, సుఖమూ ఇచ్చినవాడు తమ్ముడు. వాడు ఇంచక్కా నాన్న చూసిపెట్టిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అయిదువేలు, అదిగాక సైకిలు, అవీ పుచ్చుకున్నాడు. ప్రస్తుతం, వాళ్ల మామగారి ధర్మమా అంటూ, ఆరేళ్ల సర్వీసులో అసిస్టెంటు ఇంజనీరయి కూర్చున్నాడు—

—(అని పై పేరా గ్రాఫులన్నీ అనుకుంటూ) నడుస్తున్నాడు చక్రారావు. అతగాడి మరదలు సంక్రాంతికని అక్కయ్య యింటికి తెనాలి నుండి వచ్చింది. ఓ రెణ్ణెల్లుండి ఆపూటే తెనాలి వెళ్లింది. అధికోత్సాహంతో ఆమె వెంట వెళ్లి రెండుగంటల ఎక్స్‌ప్రెస్‌లో ఆమెను ఎక్కించి పర్మిషన్ గడువు మీరకుండా ఆఫీసు కొచ్చేస్తున్నాడు చక్రారావు.

ఎలక్షనులో గెలిచిన నాయకుడిలా వెలిగిపోతున్నాడు సూర్యుడు; గుమాస్తా ముండావాడి దారిద్ర్యంలా మండిపోతూంది మధ్యాహ్నపు ఎండ. ఒక్క నిముషం దారి ప్రక్కన చెట్టుక్రింద నిల్చున్నాడు చక్రారావు .... చెమటకు తడిసిన చొక్కాలోనుండి ఒళ్లు—నల్లటి సన్నటి ఒళ్లు కన్పిస్తూంది....మామూలుగా అయితే చొక్కాకూ, ఒంటికీ మధ్య 'బనియన్' అనే పదార్థం ఒకటి ఉండాలి. ఆ మధ్య ఎపుడో దాకా చక్రారావుకూ ఉండేది. మరీ ఈమధ్య ఆ మూడోవాడిని కన్నప్పటినుండీ సీత ఇలా చీటికీ మాటికీ అడ్డంపడుతుండెనా—అందువలన తన వందా పాతికా జీతంలో ("నెలలో మొదటి దినము మీ పొదుపు దినము", "మీరు సంపాదించేదంతా ఖర్చు చేయకండి !") నలభై అయిదు రూపాయలు అద్దెవ్వుల క్రింద వెళ్లిపోతూం దిటీవల .... అప్పటినుండీ .... విగత బనియనుడై ......

—నడిచాడు చక్రారావు చెట్టు నీడను వదిలి. (లేకపోతే, చక్రారావు వంటి వాళ్ల కోసమే నేవిటి చెట్ల నీడలూ, చల్లగాలులూ .... ? ఇదేం అశోకుడి రాజ్యమా, ఏవన్నానా??") .... ఖర్చయి పోతున్న జీతంలా త్వర త్వరగా నడిచాడు చక్రారావు .... వెనకటికి ఏదో ఓ కథలో ఒక మహర్షి ఎవడో తన భార్యకు ఎండ తగలకుండా కొన్ని ఏర్పాట్లు చేసిపెట్టాడట.... ("గేదె మార్కు గొడుగు, మంచి టపేటా సిల్కుతో తయారు చేయబడును.") చక్రారావుకు కూడా ఆ ఋషి కథ తెలుసు.

ఇప్పుడు నడుస్తుంటే గుర్తు కొచ్చింది కూడాను. ఉపవాసం ఉన్నవాడికి ఆవకాయ అన్నంలాగున ....

మాడు చుర్రుమంది. .... రుమాలును తీసి నెత్తి మీఁదుగా వేసుకుని దాని నాలుగు కొనలలో రెండింటిని లాగి గడ్డంకింద ముడి పెట్టుకున్నాడు చక్రారావు .... అయిపో యింది. ఇంక ఆఫీ సెంతదూరం ? మూడు ఫర్లాంగు లుంటుంది. మూడు ఫర్లాంగు లనగా ఎంత—మహా అయితే ఓ మైలు కన్న తక్కువేగా. వడి హెచ్చిద్దా మనుకున్నాడు చక్రారావు. హెచ్చించాడు. కుడి పాదపు స్లైరు చెప్పు టప్పుమంది.. ఒంగిచూస్తే బొటనవ్రేలి దగ్గర తోలు రింగు తెగిపోయి ఝామ్మున విరగబడి నవ్వుతూంది!—అయినా, ఏమీ ఫరవా లేదు. చక్రారావు కుడి చెప్పు ఉపయోగం తగ్గలేదు. అది 'మోహరమున దా నెక్కిను బారని గుఱ్ఱము' కాలేదు.

ఆ యొక్క చెప్పుయొక్క సేవాతత్పరతను మెచ్చుకుని "ఆహా !" అన్నాడు చక్రారావు నోరు తెరచి .... గడ్డం కింద రుమాలు ముడి తెగింది.

ఎట్టకేలకు ఆఫీసు చేరాడు···నెత్తిమీద జుట్టంటూ పెట్టాడా సృష్టికర్త···నిజంగా దయామయుడు !—లేకపోతేనా!

···అది గ్రీష్మర్తువు !

ఆ తర్వాత ఉగాది వచ్చింది.

చక్రారావు మూడో అబ్బాయి చిరంజీవి చంద్రశేఖరు డికి రెండోయేడు నిండబోయింది.

"ఏమండీ ! అబ్బాయికి ఎల్లుండి పుట్టిన దినం—" అని మహజ రందిచ్చింది సీత.

"అవునవును—"

"ఏం కొందామూ ?"

"ఏం పెట్టే ?" అన్నాడు చక్రారావు.

సీత కా మూ డక్షరాలు చాల పాతవి.

అక్కడికి ఆ ఫైలు మూత పడింది.

"నిజంగా మీరు ఎంతో బాగుండవలసిన వారండీ ! నాతోబాటు మిమ్మల్ని క్రిందికి—ఈ దారిద్ర్యంలోకి లాగాను. పాపిష్ఠిదాన్ని—" సీత నోటిని మూశాడు చక్రారావు. ఆ చెయ్యే తుడిచింది వెచ్చటి కన్నీటిని. పదేళ్ల క్రిందయితే ఏడవడం అని 'చా .... క్క .... నీ .... రా...జ...మార్గమూ' ఒక్కటుండేది చక్రారావుకు. అదిప్పుడు అలవాటు తప్పింది. (చూశారా మరి—'అభ్యాసము కూసువిద్యే!')

కాసేపు తర్వాత చక్రారావుకు నిద్ర వచ్చింది. కాని సీత మాత్రం క్రిమి సంహారం చేస్తూ కూర్చుంది. ఓ పావు గంట వ్యవధిలో ఓ పది నల్లులా, ఆరు దోమలూ వైతరణి దాటేశాయి. కాసేపు వేట మాని చిరంజీవుల వైపు చూసింది సీత. మూడోవాడి వీపు ఎర్రటి దద్దులతో పనస తోలులా ఉంది.

'ఖండాలపు దోమలు ! :.... పాపం వెధవాయి ఎలా నిద్రపోతున్నాడో—!" పోనీ వీడి పుట్టినరోజు కయినా ఒక చిన్న దోమతెర తెమ్మందా మనుకున్నా—కానీ—' అనుకుంది సీత. అనుకుని ఇటు తిరిగింది. చక్రారావు చెంపమీద పోటీపడి రసాస్వాదనలో కూచుని ఉన్నాయి రెండు గండు దోమలు—కాని ఆ రసనిలయుడు మాంఛి రసవత్తరమయిన నిద్రలో ఉన్నాడు.

సీత అనుకుంది—'దోమతెర ఎంతో అవసరం !' —అనే మేలుకున్న వేళల్లో పది లక్షల రెండుసార్లు అన్నాడు చక్రారావు కూడా—

—ఇంతలో వచ్చింది శ్రావణమాసం (రాకుండా ఎక్క డికి పోగలదు గనక ?)

ఇత్తడి మరచెంబుమీద నల్లచాదు ముక్కూ, నల్ల చాదు కళ్లతో వరలక్ష్మమ్మను తీర్చిదిద్ది నోము నోచుకుంది సీతమ్మ. సంతానం చాలనీ, సౌభాగ్యం కావాలనీ చెప్పుకుంది సీతమ్మ. తన్నేలినవాడికి మరో వంద ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగ మిప్పించమని కోరుకున్నది సీతమ్మ. అమ్మవారు నవ్వింది—(నవ్వి ఊర్కుంది.)

ఆ మరురోజు పొద్దున్న తుమ్మిడి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది చక్రారావుకు.

అవీ, ఇవీ రాసి, ఆఖరికి— " .... అన్నయ్యా,

మరేమో నేనో చిన్న ప్రమోషన్ మీద ఢిల్లీలో ఉద్యోగానికి వెళ్తున్నానూ—టెలి గ్రాంమీద ఆర్డర్లు వచ్చాయి గనుక తక్ష ణమే వెళ్ళి అక్కడ వాలాలీ—అందుచేత, దారిలోనే ఉన్నప్పటికీ మీ వూళ్ళో దిగ లేక పోతున్నానూ—అందుకు క్షమించి మంగళవారం నాలుగింటికి జి. టి. కి నువ్వూ, ఒదినా స్టేషనుకు తప్పకుండా రావలసిందీ—ఈ మాటే లలిత కూడా రాయమన్నదీ...." అని రాశాడు తమ్ముడు.

వ్రతం చేసింది సీత : ఫలితం దక్కింది లలితకు.

(సీత చేసింది నిష్కామకర్మ యగునా ? లేక, పూర్వ జన్మలో లలిత ఏమి నోము నోచుకునెను ?)

ఎలాగయితే నేం—చక్రారావు డ్రిల్లు సూటులోనూ, సీతమ్మ కట్ పీసెస్ వాయిల్ లోనూ తయారయి, చిరంజీవులు ముగ్గుర్నీ పక్కింటి బామ్మ గారికి అప్పజెప్పి (బామ్మ మార్కు స్వచ్ఛంద సేవకులు వర్ధిల్లాలి!) స్టేషనుకు సరిగ్గా టైము కొచ్చారు. చక్రారావులాంటి గుమాస్తా వచ్చిన టైము ననుసరించి తాను రావడ మేమిటని కించపడిన జి. టి. ఎక్స్‌ప్రెస్, క్లాస్—1 ఆఫీసరులా 320 నిముషాలు 'లేటు' గా వచ్చింది...

సరే—అది ఇంజన్లు నీళ్లు తాగేసే స్టేషనేమో—చక్రారావు సావకాశంగా మూడో తరగతి పెట్టె లన్నిటినీ తణిఖీ చేశాడు. చేసి నిస్పృహ చెందుతుండగా—

"అదిగోనండీ మరదిగారు!" అని గుర్తు పట్టింది సీత.

పదహా రడుగుల నిడివి గల ఫ్రేము మధ్య తిరుపతి వేంకటేశ్వరుడిలా మొదటి తరగతి పెట్టె గుమ్మంలో నిల్చుని, చూస్తున్న తమ్ముడు అన్నయ్యనూ, ఒదిననూ గుర్తుపట్టి క్రిందకు దూకాడు.

అన్నయ్యా తమ్ముడూ కలుసుకున్నారు.

గుమాస్తా, ఇంజనీరూ మాట్లాడుకున్నారు.

సీతా, లలితా కలుసుకున్నారు.

బొంబాయి వాయిలూ, కంచి పట్టూ పలకరించుకున్నాయి.

రైలు కదిలింది.

బత్తాయి పండు తొనల్ని ఒలిచి మొగుడి ఎదుట పళ్లెంలోని బిస్కెట్ల పక్కగా పెడుతూ— "మీ అన్నయ్య నాన్నగారి మాట వినివుండవలసింది—" అన్నది లలిత. ఎక్కడో చురుక్కుమని తగిలినట్లయింది వా ళ్లాయునకు. కానీ—మొదటి తరగతి పరుపులూ, బత్తాయి పండ్లూ ఆ చురుకుదనాన్ని చల్లబరిచాయి.

సరిగ్గా ఆ సరికే—

స్టేషను నుండి తమ పేటకు వెళ్లే ఆఖరి సిటీ బస్సు వెళ్లిపోగా, అది ఎరిగిన జట్కావాడు రెండు రూపాయలడగ్గా, వాడి తమ్ముడు రిక్షావాడు రూపాయిన్నర చెప్పాడు—(తగిలిన వేలికే తగులును—అనేది ఆర్యోక్తిట! చక్రారావు ఆర్యుడా?)

"ఎందుకండీ ఈ పాటి దానికి రూపాయీ, రెండ్రూపాయిలూనూ—" అంది సీత చిరునవ్వుతో.

"ఆ....!! .... వూ ....??"

"నెమ్మదిగా నడిచేద్దాం పదండి ...."

నడకంటే చక్రారావుకి చెప్పాలేవిటి? జోరాసింగంత ఉత్సాహమూ, జటోపెక్కంత వేగమూను ....! ఎటొచ్చీ సీతకే కాస్త యిబ్బంది.

ఎలాగయితేనేం ఆ రాత్రి పదిన్నరకు పక్కింటి బామ్మ గారికి 'రిలీఫ్' వచ్చింది—

ఆ తర్వాత కొన్రోజులకు దీపావళి వచ్చింది.

"ఎంతయినా ప్రమిదల కున్న అందం .... ఆ బల్బులకు రాదు!" అంది సీత ఎదురింటి నియాన్ లైట్ల సోయగాలను చూస్తూ—(పొరుగింటి పుల్లకూర ఎల్లవేళలా రుచి కానేరదు.)

"సరే ....! అయినా సీతా! ఆ ముగ్గుమీద ఒక్కసారే ఆరు ప్రమిద లెందుకూ—రెండు చాలవూ?—" అన్నాడు చక్రారావు—ఆరు ప్రమిదలూ (ఇంటూ) రెండేసి పలాల నూనే (ఇంటూ) పదిహేనేసి పైసలూ (ఈసీక్వలూ) వగయిరా—

"అమ్మోయ్! .... నా కాకర పువ్వొత్తి ఎలా వెలుగుతోందో చూడవే—" అంది కూతురు లక్ష్మి.

"నీ మొహం! నా మతాబావే ఎంథో బాగుంది—" అన్నాడు పెద్దవాడు.

వాళ్ల మొహాల వెలుగుతో సీత హృదయం దీపావళి చేసుకుంది ....

అన్ని కష్టాలూ అడ్వాన్సు నోటీసు లేకుండానే వస్తాయి. ఆ విధంగానే ఆ రాత్రి రెండు గంటలకు సీతకు హఠాత్తుగా వచ్చింది విపరీతమయిన చలి జ్వరం. మూడో అంతస్తుమీద ఎగరేసిన జండాలా వణికిపోయింది సీత—నిద్రలో ఉన్న చక్రారావు ఆమె మూలుగువిని లేచి కూర్చున్నాడు.

ఆమెమీద మూడు దుప్పట్లు కప్పాడు. ఇంకో రెండు కప్పును గాని, లేవు. అయినా జ్వరం ఎగరేసిన జెండా విజృంభణ తగ్గలేదు.

పిల్లలు ముగ్గురూ నిద్రపోతున్నారు. ఆఖరివాడు ఏదో బొంగరం గురించి కలవరిస్తున్నాడు.

చన్నీటిలో తడిపి సీత నుదుటిమీద చక్రారావు వేస్తున్న గుడ్డలు క్షణంలో పొడి అయిపోతున్నాయి...

'మాంఛి రగ్గు ఒక్కటి వుంటే ఎంత బాగుండును—ఈ చలికి వెచ్చగా కప్పివుండవచ్చు' అనుకున్నాడు చక్రారావు—(మెరీనో జాతి గొర్రెలు మంచి ఉన్ని నిచ్చును—')

—"సీతా ! అసలే నీ ఆరోగ్యం అంతంతమాత్రం కదా! అంత పొద్దున్నే లేచి ఆ స్నానం చెయ్యడం, ఈ పిండి వంటలు—అదీ, ఇంత అలసట—వద్దంటే నా మాట విన్నావూ?' అన్నాడు చక్రారావు.

అసలా మాట వినే దశలో లేదు సీత. హఠాత్తుగా ఏదో అరిచింది. కళ్లు తెరచి ఏదోగా చూసింది——

చక్రారావు గుండెలో విష్ణుచక్రం తిరిగింది. పెద్ద వాడిని లేపి కూర్చోబెట్టి డాక్టర్ రాజేశ్వరమ్మ దగ్గరకు పరుగెత్తాడు—కాళ్లమీద.

ఆమె వెంటనే వచ్చి చూసి ఒక మందు రాసి యిచ్చింది. సీతకేమీ ఫరవాలేదంది. రెండు రూపాయ లివ్వ బోయిన చక్రారావుతో "అబ్బే నాకు తర్వాత ఇద్దరు గాని... ముందా మందు తెండి. పొద్దుటికి జ్వరం పోతుంది. నాల్గయిదు రోజుల దాక ఆవిడకు పళ్లూ అవీ యిప్పించండి—" (ఈ కలియుగంలో ధర్మదేవత పాదం ఆనడానికి ఆమాత్రం చోటయినా కల్పిస్తున్నదీ రాజేశ్వరమ్మలేనేమో !") —అని రిక్షాలో వెళ్లిపోయింది డాక్టరు. ఆ మంచితనంలో తడిసి ముద్దయి నిల్చున్న చక్రారావు మళ్లీ పరుగెత్తాడు; ఈసారి బజారువీధికి.

ఇరవై నాలుగు గంటలూ తెరిచివుండే ఒకానొక మందుల షాపును చేరుకున్నాడు చక్రారావు. నిద్రమత్తుతో, చక్రారావిచ్చిన చీటీని చూచి, డబ్బులు పుచ్చుకుని మందిచ్చాడు షాపు వాడు. ఇంటికి పరుగెత్తసాగాడు చక్రారావు.

అప్పులవాడిలా డబడబ చప్పుడు చేసింది ఆకాశం. వీధిదీపా లొక్కసారి ఆరి వెలిగాయి. పెద్ద గాలి వీచింది. ఆ చల్లదనానికి ఆకాశం మబ్బుల దుప్పటి తీసి మెరుపుల కళ్లతో చూసింది వడిగా, పొడిగా వెడుతున్న చక్రారావును.

"అమ్మ చక్రారావూ ! నాతో పోటీయే !!" అనుకుంది మేఘమాల; టపటపమని నవ్వసాగింది.

నెత్తిమీద చెయ్యి పెట్టుకుని, జుత్తుమీద నుండి నూనెతో కలిసి కళ్లమీదుగా కారుతున్న వర్షం నీటిని తుడుచు కుంటూ, జేబులో ఉన్న మందు పొట్లం తడవకుండా చూచు కుంటూ—వడివడిగా, తడితడిగా నడిచి వెడుతున్న చక్రారావుని ఆప్యాయంగా ఆపి రెండు నిముషాలసేపు నిలువునా స్నానం చేయించింది వర్షం ......

'మార్చిలోనే అనుకున్నా గొడు గొకటి కొవాలని—' అనుకోబోయిన చక్రారావు చెంప చెళ్లు మన్పించే వాన జల్లుని తెచ్చిందొక హోరుగాలి—

'ఈ గాలిలో గొడుగేం ఆగుతుందీ—!' అనుకుంటూ చక్రారావు ఇంటోకి అడుగు పెట్టాడు.

—నాలుఘ్గంటల తరువాత—పొద్దున్న ఆరింటికి కళ్లు తెరిచి నవ్వింది సీత.

"ఎలా ఉంది సీతా ?"

"బాగానే ఉంది .... కాస్త నీరసంగా ఉంది. అంతే !"

"రెండ్రోజులపాటు నువ్వు కదలకూడదు .... "

మళ్లీ నవ్వింది సీత— "అయినా నా కిన్ని దుప్పట్లు కప్పా రేమండీ—?"

"ఒఖ్క రగ్గు లేదు కనక !"

—అంతవరకూ జాగరణ చేసిన చక్రారావుకు అర గంట తర్వాత కునుకు పట్టేసింది ....

"ఓయ్ షాపువాడూ ! ఆ జరీ చీరలూ, సూటింగూ వేరుగా ఉంచు. వాటితోబాటే, ఇదిగో చూడూ ! ఓ అర డజను మాంఛి హైక్లాస్ రగ్గులూ, ఆ పాతిక రూపాయల దోమతెరలు అయిదూ, ఒకటోరకం రెయిన్ కోటొకటీ పడేయి—అన్నట్టు మరిచిపోయాను. ఓ గ్రోసు గొడుగులు— అవునయ్యా బాబూ ! ఓ గ్రోసు గొడుగులు కూడా ఇచ్చేయి... ఏం ? బిల్లు ఇస్తే ఆనక మా డ్రయివర్‌తో పంపుతా డబ్బు" అని ఎడాపెడా ఆర్డ ర్లిచ్చేస్తున్నాడు నిద్రలో ఉన్న బుతు చక్రారావు !